## క్లుప్తంగా

### కొత్త అమావాస్యకు నూకాంబిక ఆలయాల ముస్తాబు

యలమంచిలి : ఈనెల 8, 9న జరిగే కొత్త అమావాస్య జాతర, ఉగాది సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలో పలు గ్రామాల్లో నూకాంబిక ఆలయాలను ఉత్సవ కమిటీలు ముస్తాబు చేస్తున్నాయి. యలమంచిలి పట్టణం పోస్టాఫీస్ వద్ద ఉన్న నూకాలమ్మ ఆలయాన్ని అందంగా పూలతో అలంకరిస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో నూకాంబిక ఆలయాలను అందంగా రంగులు వేసి అలంకరిస్తున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలో, పలు గ్రామాల్లో రామాలయాలను అందంగా రంగవల్లికలతో రంగులు వేసి రామాలయాలు ముందు పందిళ్లు వేసి అందంగా అలంకరిస్తున్నారు.

### ఎన్నికల కోడ్‌తో ఉత్తుత్తి సమావేశం..

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కాగా ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు సభ్యుల సంతకాలు తీసుకుని సభను ముగించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమస్యలు, అభివృద్ధి ఇతర అంశాలపై చర్చించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సీతారామరాజు పాల్గొన్నారు.

### మ్యుటేషన్లపై దృష్టి సారించాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ మ్యుటేషన్లపై దృష్టి సారించాలని తహసీల్దార్ పి.పాపారావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించాలని, పట్టాదారు పుస్తకాల్లో తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. డీటీ వినయ్‌కుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

### 275 మందికి వైద్య పరీక్షలు



సుంకపూరులో ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన వైద్య సిబ్బంది

కోటవురట్ల : సుంకపూరు గ్రామంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందించారు. ఎంపీహెచ్ఈవో గోవిందరావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. 275 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్టు తెలిపారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రోగులకు సూచించారు. ప్రధానంగా వృద్ధులు కొద్ది రోజులు బయట తిరగకుండా ఇంటిపట్టునే ఉంటే మంచిదన్నారు.

### పశువుల అక్రమ రవాణా పట్టివేత



స్వాధీనం చేసుకున్న పశువులు

పాయకరావుపేట : మండలంలో అక్రమంగా రవాణా జరుగుతున్న 51 పశువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. మండల పరిధిలో గల సీతారాంపురం గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా కంటైనర్‌లో ఏవిధమైన అనుమతి లేకుండా తరలిస్తున్న 51 పశువులను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని, కంటైనర్ డ్రైవర్‌ను, పశువుల రావాణాకు కారకులైన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, పశువులను వెంకోజీపాలెం గోశాలకు తరలించినట్టు ఎస్‌ఐ జోగారావు తెలిపారు.

### సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం

రాంబిల్లి : మండలంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో శనివారం సమ్మేటివ్ 2(వార్షిక పరీక్షలు) ప్రారంభమయ్యాయి. ఒకటో తరగతి నుంచి 9 వ తరగతి వరకు విద్యార్థులు ఈ పరీక్షలు వ్రాసారు. పలు పాఠశాలల్లో పరీక్షల తీరును ఎంఈవోలు ఎం. సూర్యారావు, వి. సూర్యనారాయణ పరిశీలించారు. జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి రికార్డులతో పాటు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయాలని ఎంఈవో సూర్యారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ నెల 23 వరకు పాఠశాలల్లో తరగతులు నిర్వహించడం జరుగుతుందని 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయన్నారు.



# పూరీలో వైఎస్సార్‌సీపీ హోరు

- మళ్లీ జగనే సీఎం కావాలని మత్స్యకార నాయకుల ప్రచారం



పూరీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అక్కడి మత్స్యకార నాయకులు

పాయకరావుపేట: ఒడిశా రాష్ట్రం పూరిలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు వైఎస్సార్‌సీపీ విజయానికి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పాయకరావుపేట మండలంలోని మత్స్యకారులు చేపల వేట నిమిత్తం అక్కడకు వెళ్లి, తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వారందరికీ ఇక్కడ ఓటు హక్కు ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గెలుపు కోసం మత్స్యకారులందరూ కృషి చేయాలని వారం రోజుల క్రితం ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావుతో సహా కొంతమంది నాయకులు పూరీ వెళ్లి ప్రచారం చేశారు. ఇప్పుడు అక్కడ మత్స్యకార నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అక్కడ మత్స్యకార నాయకుడు ప్రసన్న ఆధ్వర్యంలో మత్స్యకార నాయకులు చేపల రమణ, బెనుగు ఈశ్వరావు, కొనడ రాజు, దూడ మాధవ, వాసుపిల్లి దేవుడు, చేపల నానాజీ, దైలిపిల్లి లోక్‌నాథ్, సురాడ జగన్నాథం, గోసల జాషువ, బొంది బాల తదితరులు వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రచారం సాగిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు తెలిపారు.

## జగనన్న పాలనలోనే పేదల సంక్షేమం

- వాడవాడలా వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం



పెన్షన్ తీసుకున్నావా అవ్వా అంటూ పలకరిస్తున్న మాజీ ఎంపీపీ శారదాకుమారి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ లు

ఎస్.రాయవరం : ప్రజా సంక్షేమమమే ధ్యేయంగా, పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ రుణపడి ఉన్నారని మాజీ ఎంపీపీ, చినగుమ్ములూరు ఎంపీటీసీ మండల మహిళా నాయకులు బొలిశెట్టి శారదా కుమారి అన్నారు. భీమవరం గ్రామంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారిలతో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గరగా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో గడప గడపకూ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు వివరించి, ఇప్పటి వరకు లబ్ధి పొందిన పథకాలు గుర్తు చేశారు. మరో 36 రోజుల్లో ఎన్నికలు జరగనున్నయని పేదల బతుకు బాగుండాలి, దోపిడీ వ్యవస్థ రాకుండా ఉండాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఇక్కడ ఎమ్మెల్యే కంబాల జోగులును గెలిపించుకుని సీఎంగా మరో మారు జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల వద్దకు వెళ్లి వ్యవసాయ కూలీలను పలకరించారు. ప్రతిపక్షాలు ఎన్ని ప్రలోభాలు పెట్టినా వినకుండా ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తామని మేమంతా ఇప్పటివరకు లబ్ధి పొంది ఉన్నామని చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాలపర్తి వెంకటరమణ, వడ్లమూరి మోహన్‌రావు, పోలినాటి భాస్కరరావు, ఉగ్గిన సత్తిబాబు, మూకురుపు జాను, మడగల బాబూజి, గరగా నాని పాల్గొన్నారు.

# గ్రామాల్లో గరగల సందడి

- నేడే నూకాలమ్మ జాతర
- రాత్రిళ్లు గ్రామదేవతల ప్రతిరూపాల ఊరేగింపు
- కొత్త అమావాస్య వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయాలు



రాత్రిపూట దేవవరంలో అమ్మవారి ఘటాలతో నృత్యం చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : పల్లెల్లో గ్రామదేవతల పండగ సందడి మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో తమ ఆరాధ్యదేవతలైన నూకాలమ్మ, అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా కొత్త అమావాస్యకు 10 రోజుల ముందు నుంచి ఈ సందడి మొదలవుతుంది. గ్రామాల్లో రాత్రి సమయాల్లో గరగలు, ఘటాలు పేరుతో అమ్మవారి ప్రతిరూపాలను కొంత మంది పూజారులు నెత్తిన పెట్టుకుని నృత్యం చేస్తూ గ్రామాల్లో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారి ఘటాలకు పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. మరికొంత మంది తమ ఇళ్ల వద్ద అమ్మవారి ఘటాలకు సంబంధించి మొక్కులు తీర్చుకునే కార్యక్రమం చేపడతారు. నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, దేవవరం, కాగిత, నెల్లిపూడి, పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, పెంటకోట సీతారామపురం, నామవరం తదితర గ్రామాల్లో నూకాలమ్మ జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇలా పలు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను తీసి రాత్రి సమయాల్లో ఊరేగిస్తున్నారు. పిల్లలు, పెద్దలు రాత్రంతా అమ్మవారి ఘటాలతో పాటు గ్రామమంతా తిరిగి సందడి చేస్తున్నారు. డప్పువాయిద్యాలు, నేలవేషాలతో కొత్త అమావాస్యవరకు గ్రామాలు సందడిగా ఉంటాయి. 10 రోజుల పాటు గ్రామాల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించి కొత్తఅమావాస్య ముందురోజు రాత్రంతా పెద్ద జాతర నిర్వహిస్తారు. ఆదివారం ఈ జాతర జరగనుంది. తెల్లవార్లూ నేల డ్యాన్స్‌లు, తప్పెటగుళ్ల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. నక్కపల్లి, వేంపాడు, దేవవరం తదితర గ్రామాల్లో ఈ నూకాలమ్మ జాతర చాలా ఘనంగా జరుగుతుంది. కొత్తఅమావాస్య రోజు ఆయా గ్రామాల్లో ఉన్న అమ్మవార్లకు కానుకలు, మొక్కుబడులు సమర్పించుకుంటారు. కొత్తఅమావాస్య నాడు నిర్వహించే అమ్మవారి పండగకు ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబవుతున్నాయి.

# దళితులంతా సీఎం జగన్ వెంటే..



ఏపీ ఎరుకుల సేవాసంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొలిశెట్టి గోవిందరావు తదితరులు

ఎస్.రాయవరం : దళిత వర్గాలకు అండగా నిలిచిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. ఏపీ ఎరుకుల సేవాసంఘ నాయకులు ఆధ్వర్యంలో మండల కేంద్రం ఎస్.రాయవరంలో బొలిశెట్టి నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ దళితులకు అన్ని విధాలా సంక్షేమ పథకాలు కేటాయించి అందజేశారన్నారు. ప్రధాన సమస్యల పరిష్కారంలోనూ ముందు చూపు ఉందన్నారు. దళితులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకే ఉన్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, ఏపీ ఎరుకుల సేవాసంఘం ఉత్తరాంధ్రా ఆర్గనైజర్ సెక్రటరీ మైసర్ల ఈశ్వరరావు, మహిళా దాసరి నారాయణమ్మ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మైసర్ల అప్పారావు, జిల్లా యూత్ ప్రెసిడెంట్ రాగిన భూలోక, మండల అద్యక్షులు రాగిన నాగరాజు, మహిళా అధ్యక్షులు మైసర్ల రాగిన సంధ్య, మైసర్ల భవాని, నాగమణి పాల్గొన్నారు.

## నిప్పులు చెరిగిన సూరీడు



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

కోటవురట్ల : సూరీడు నిప్పులు చెరిగాడు. మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచే వడగాడ్పులు వీచాయి. రహదారుల్లో ప్రయాణం నిప్పుల కొలిమిని తలపించింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో చాలా వరకు జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. మరో రెండు రోజుల పాటు ఇదే తరహా ఎండతీవ్రత ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. బయట తిరిగేవారు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మునగపాక : వేసవి ఉష్ణోగ్రతల్లో మార్పులు రావడంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 11 గంటలకే భానుడి ప్రతాపం కనిపిస్తుంది. దీంతో రైతులు తమ పొలం పనులు ముగించుకొని ఇంటి ముఖం పడుతున్నారు. శనివారం 11 గంటలకే మునగపాక మెయిన్‌రోడ్డు నిర్మానుస్యంగా కనిపించింది. రాకపోకలు సాగించేవారు తలకు టోపీలు, మహిళలు చున్నీలు, చీర కొంగులు అడ్డం పెట్టుకుంటున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఎండ తగ్గకపోవడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

## నేడు కొరుప్రోలులో ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రచారం

ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ఎన్నికల ప్రచారం కార్యక్రమం విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు పిలుపునిచ్చారు. అడ్డురోడు కార్యాలయం వద్ద శనివారం పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు. గ్రామంలో ఉదయం 7 గంటల నుంచి ప్రచారం ఉంటుందని మండల నలుమూలల ఉన్న పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని చెప్పారు. మధ్యాహ్నం భోజనం విరామం తరువాత ఇదే గ్రామంలో గడపగడపకూ కార్యక్రమం ఉంటుదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మధువర్మ, చోడిపల్లి గోవిందు, అప్పలరాజు ఉన్నారు.

## ఏపీఐఐసీ భూముల్లో పనులు అడ్డుకున్న దళితులు



పనులు అడ్డుకున్న రైతులు

నక్కపల్లి : మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూముల్లో పనులను చందనాడ గ్రామానికి చెందిన దళితులు, పలువురు రైతులు అడ్డుకున్నారు. చాలా ఏళ్ల నుంచి ఈ గ్రామాల పరిధిలో సుమారు 54 ఎకరాల ప్రభుత్వ భూములను దళితులు సాగు చేసుకుంటున్నారు. భూసేకరణలో భాగంగా ఈ భూములను ఏపీఐఐసీ వారు సేకరించారు. రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వ భూములు సాగు చేసుకునే వారికి కూడా పరిహారం చెల్లిస్తామని గతంలో ఏపీఐఐసీ అధికారులు తెలిపారని, ఇప్పుడు పరిహారం చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకుని రోడ్లు, డ్రెయినేజీలు ఇతర సదుపాయాల కోసం పనులు ప్రారంభించడానికి సిద్ధపడుతున్నారని బాధిత రైతులు ఆరోపించారు. తమకు పరిహారం చెల్లించేవరకు ఈ భూముల్లో ఎటువంటి పనులు చేపట్టనిచ్చే ప్రసక్తి లేదన్నారు.


## ఆకట్టుకున్న సారె ఊరేగింపు



నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు

మునగపాక : మండల కేంద్రంలో శనివారం రాత్రి నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. నూకాంబిక అమ్మవారి పండగ సందర్భంలో ఏర్పాటు చేసిన సారె ఊరేగింపు డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయం నుంచి గ్రామంలోని అన్ని వీధుల గుండా సాగింది. నోరూరించే వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని ఆలయ చైర్మన్ మళ్ల రామజగన్నాథం తెలిపారు. అలాగే 8వ తేదీన అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## సువర్ణపాలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక : ప్రజలకు రానున్న రోజుల్లో మరింత సువర్ణ పాలన అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాక బీసీ కాలనీలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి పాలన కోరుకుంటున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలివేర గణేష్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు, పెంటకోట వెంకట్, బొడ్డేడ మహేష్, నాయుడు, ఆడారి సంతోష్‌కుమార్, జగ్గు పాల్గొన్నారు.

## స్థల వివాదంపై కేసు నమోదు

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్య పేట స్థలం వివాదమై రెండు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



పాయకరావుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

పాయకరావుపేట : నియోజకవర్గకేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయాన్ని రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పట్టణ శాఖ అధ్యక్షుడు దనిశెట్టి బాబి, మాజీ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, ఎంపీపీ తాతారావు, జెడ్పీటీసీ సూరిబాబు తదితరులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు దుశ్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇక్కడ ఎమ్మెల్యేగా గొల్ల బాబూరావును 31 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారని, జిల్లాలోనే అత్యధిక మెజార్టీ అన్నారు. కంబాల జోగులును కూడా అంతకంటే రెట్టింపు మెజార్టీతో గెలిపించాలన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే మన పార్టీకి శ్రీరామ రక్ష అన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ తాతారావు, జెడ్పీటీసీ సూరిబాబు మహిళా నాయకులు శ్రీదేవి, సుందరలత, అమ్మాజీ, శేషారత్నం పాల్గొన్నారు. జిల్లా పబ్లిక్ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు దనిశెట్టి బాబ్జీ, ఎస్సీ సెల్‌జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, ఉపసర్పంచ్ జగత శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు అన్నవరం దేవస్థానం డైరెక్టర్ సుందరరావు, వైస్ ఎంపీపీ దనిశెట్టి బుజ్జి, ఎస్సీ సెల్ నాయకులు డొక్కుమళ్ల నానాజీ, నెలపర్తి అర్జున్, బోడపాటి: గోవిందు, బీసీ సెల్ నాయకులు లోవరాజు మండల కోఆప్షన్ సభ్యుడు కాదా రామకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మత్స్యకారులంతా జగనన్నకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ, నర్సింహమూర్తిలు

నక్కపల్లి : మండలంలో మత్స్యకారులంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ కోరారు. శనివారం వారు రాజయ్యపేటలో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ ఇవ్వని విధంగా వైఎస్సార్‌సీపీ మత్స్యకారులకు అత్యధిక గుర్తింపు నిచ్చిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, డీసీసీబీ పదవులను ఇచ్చిందన్నారు. రాజకీయంతా ఎంతో ప్రాధాన్యం కలిగిన పదవులను గంగపుత్రులకు ఇవ్వడం జరిగిందన్నారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే పరిహారం రూ.10వేలకు పెంచడంతోపాటు, ప్రమాదవశాత్తూ మరణిస్తే ఇచ్చే నష్ట పరిహారం కూడా రూ.పది లక్షలకు పెంచారని, డీజిల్‌పై సబ్సిడీ పెంచడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో మత్స్యకారుల ఉపాధికి మత్స్యసంపద మార్కెటింగ్, వారి ఇంజిన్లు, వలలు భద్రపరుచుకునేందుకు, ఎగుమతులు దిగుమతుల కోసం ఫిష్ లాండింగ్ సెంటరు, మినీ జెట్టీ కూడా మంజూరు చేసి, నిధులు కూడా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. బీసీల పక్షపాతిగా అన్ని బీసీ కులాలకు సామాజిక, రాజకీయ పరంగా తగిన గుర్తింపు నిచ్చిన జగనన్నకు కొన్ని కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయంగా పదవులు పొందిన కొంత మంది జగనన్నకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. మత్స్యకారులు మాత్రం నీతికి నిజాయితీకి మారు పేరుగా నిలుస్తున్నారన్నారు. ఈ ఆదరణ ఎన్నికల్లో చూపించి ఇక్కడ జగనన్న బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. టీడీపీ మత్స్యకారులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వాడుకుందన్నారు. అదే ఓటుతో వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అండ్‌కోకు బుద్ధి చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే ఎంపీ పదవులను సయితం జగనన్న బీసీ వర్గాలకే ఎక్కువ కేటాయించారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, బచ్చలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశు, ఎరిపిల్లి ముసలయ్య, పిక్కి నూకరాజు, యజ్జల అప్పలరాజు, మైలపల్లి సూరిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

# గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందిస్తున్న గ్రామ వలంటీర్లు

పాయకరావుపేట : మండలంలో గల మాసాహెబుపేట గ్రామ సచివాలయ గ్రామ వలంటీర్లు 16 మంది స్వచ్ఛందంగా శనివారం రాజీనామా చేశారు. 16 మంది వలంటీర్లు విడివిడిగా వారి రాజీనామా పత్రాలను రాసి ఎంపీడీవో కె.స్వప్నకు శనివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తాము ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్ళి సంక్షేమ పథకాలు వారికి చేరేటట్టు చేసేవాళ్లం అని అన్నారు. కానీ ఎన్నికల కారణంగా టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడు తమ పై వున్న దురుద్దేశంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి భయందోళనలకు గురి చేయడం కారణంగా తాము స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్ళ యథా ప్రకారం వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించి వలంటీర్ సేవలను కొనసాగించడం జరుగుతుందని జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇవ్వడం, తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలి సంతకం వలంటీర్ వ్యవస్థను మరలా కొనసాగిస్తామని ప్రకటించడం తమకు ఎంతో ఆనందం కలిగించిందని అన్నారు. మే 13 న జరిగే ఎన్నికలకు తామందరం వైఎస్సార్ పార్టీ విజయానికి కృషి చేస్తామని, సంక్షేమ పథకాలను యథా ప్రకారం ప్రజల్లోకి తీసుకెళ్ళి, మరలా జగన్ మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసేలా కృషి చేస్తామని అన్నారు.

## నేడు మునగపాకలో ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక : మునగపాక నందీశ్వర ప్రాంగణంలో ఈ నెల 7న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గోపీ సెల్ పాయింట్ అధినేత వెలగా గోపీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు జరుగుతాయన్నారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోపీ కోరారు.